క్లుప్తంగా

బస్టాండ్ ఏర్పాటుకు స్థలం పరిశీలన


బస్టాండ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం మూర్తి

ఎటపాక: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటుకు రీజనల్ మేనేజర్ మూర్తి సోమవారం స్థల పరిశీలన చేశారు. స్త్రీశక్తి పథకం అమలుకు అంతర్రాష్ట్ర సరిహద్దు సమస్య కారణంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కొల్పోతున్నారు. దీంతో పథకం అమలుకు ఆటంకాలు తొలగించేందుకు ఆర్టీసీ ఉన్నతాదికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆర్ఎం మూర్తి మండల కేంద్రంలో పర్యటించారు. అనంతరం తహసీల్దార్ సుబ్బారావుతో కలిసి తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని బస్టాండ్ నిర్మాణానికి పరిశీలించారు.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రెవెన్యూ శాఖ ద్వారా అందుతున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌తో ఆయన మాట్లాడుతూ ప్రజలకు సక్రమంగా రెవెన్యు సేవలు అందించాలనారు. మండల కేంద్రాంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు అరికట్టాలన్నారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

21న శరభన్నపాలెంలో రక్తదాన శిబిరం

కొయ్యూరు: దివంగత లోకులగాంధీ వర్ధంతి సందర్భంగా ఈనెల 21న శరభన్నపాలెంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు దితోడు లోకులగాంధీ ట్రస్ట్ సభ్యులు సోమవారం తెలిపారు. లోకులగాంధీ అభిమాని అయిన ల్యాబ్ టెక్నీషియన్ మనోజ్ ఆధ్వర్యంలో ఉచితంగా సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రక్తదానం చేసుందుకు యువత ముందుకు రావాలని కోరారు. అదే రోజున అర్చకులకు సన్మానం, పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.వృద్ధులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు.

పీసా కమిటీ ఎన్నికల అధికారులకు శిక్షణ


సూచనలిస్తున్న ఎంపీడీవో ప్రసాదరావు

కొయ్యూరు: పీసా కమిటీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారుల, కార్యదర్శులకు ఎంపీడీవో ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రేవళ్లు, రాజేంద్రపాలెం, కినపర్తి పంచాయతీలకు సంబంధించి పీసా కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షుడి పదవులకు ఎన్నికలు వివిధ కారణాల వల్ల నిలిచిపోయాయి. ఆయా ప్రాంతాల్లో ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహించేందుకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా ఎన్నికలకు సంబంధించి నిర్వహణ, ఇతరత్రా అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో ప్రసాదరావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు.

వైస్ ఎంపీపీ చొరవతో బండరాళ్ల తొలగింపు


బండరాళ్లు తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: రంగబయలు పంచాయతీ కోసంపుట్టు ఘాట్‌రోడ్డులో బండరాళ్లు అడ్డంగా పడి రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. స్థానికులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న స్థానిక ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి కోసంపుట్టు ఘాట్ మార్గాన్ని సోమవారం పరిశీలించారు. బండరాళ్ల తొలగింపునకు పొక్లెయిన్ ఏర్పాటుచేసి, యుద్ధప్రాతిపదికన బండరాళ్లను తొలగించి, రాకపోకలకు మార్గం సుగుమం చేయించారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మట్టిగూడ నుంచి జోడిగుమ్మ వరకు ఉన్న ఘాట్ మార్గంలో రక్షణ గొడలు నిర్మించి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ భాగ్యవతి కోరారు.

అతలాకుతలం

- ఎడతెరిపి లేకుండా వర్షాలు
- ఉధృతంగా వాగులు, గెడ్డలు
- నేలకొరిగిన వృక్షాలు
- నిలిచిన రాకపోకలు
- జలదిగ్బంధంలో గ్రామాలు
- ఆందోళనలో గిరిజనులు


అన్నవరం బ్రిడ్జిని పరిశీలిస్తున్న పీవో అపూర్వభరత్, ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా


రాజవొమ్మంగిలో ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నేరు వాగు


ఉధృతంగా పొల్లూరు జలపాతం

అరకులోయటౌన్: మన్యంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ఏకధాటి వర్షం వలన ప్రజలెవ్వరూ ఇళ్లను వదిలి బయటకు రావడం లేదు. వాగులు, గెడ్డలు పొంగటంతో మారుమూల గ్రామాల గిరిజనులు రాకపోకలు స్తంభించాయి. శివారు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పెద్ద పెద్ద వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షానికి ఇళ్లపై చెట్లు కూలడంతో నష్టం జరిగింది. ఏకధాటి వర్షానికి కొన్నిచోట్ల ఇళ్లు దెబ్బతిన్నాయి. గెడ్డలు దాటవద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని, ఎవరూ బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగుల వద్ద పోలీసులు పహారా కాస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది.

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయి వద్ద గెడ్డ ఉగ్రరూపం దాల్చింది. సూమారు 6 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పర్యాటకులను చాపరాయికి అనుమతించకుండా నిర్వహకులు చాపరాయిని మూసివేశారు.

పెదబయలు: మండలంలోని ఇంజరి పంచాయతీ చీకుపనసలో పాత్రోంగి శివలింగం మట్టి ఇంటి గోడ కూలింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో దార్రెల పంచాయతీ పెదపేటలో వర్షానికి కొర్రా ద్రోణ అనే మహిళ గృహం గొడ కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని వర్షాల కారణంగా పర్యాటకుల సందర్శనాలు రద్దు చేశారు. కొత్తపల్లి జలపాతాన్ని తహసీల్దార్ గిడ్డి రాజ్‌కుమార్ సోమవారం సందర్శించి, ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

సీలేరు. ఆంధ్ర– ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గెడ్డలు దాటే ప్రయత్నం చేయవద్దని ఎస్ఐ రవీంద్ర సూచించారు.

ఎటపాక: బుట్టాయిగూడెం, తోటపల్లి ప్రధాన రహదారులపై చెట్ల కూలడంతో రాకపోకలు నిలిచాయి. సీఐ కన్నపరాజు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన చెట్లు తొలగింపు చర్యలు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. గుండాల కాలనీ, కాపవరం కాలనీల్లో మాణిక్యం, భవాణి ఇళ్లపై చెట్లు కూలడంతో గృహాలు దెబ్బతిన్నాయి. గోదావరి వరద క్రమేపి పెరుగుతుండడంతో వాగుల పరీవాహక ప్రాంతాల్లోని పొలాల్లోకి వరద నీరు చేరింది.

రాజవొమ్మంగి: జడ్డంగిలోని మేడేరు ఆనకట్ట ఉరకలెత్తుతూ దిగువకు ఏలేరు ప్రాజెక్టువైపు పరవళ్లు తొక్కుతోంది. గెడ్డల వద్ద పోలీసు పహారా కాస్తున్నారు.

వి.ఆర్.పురం: భారీ వర్షాలకు అన్నవరం బ్రిడ్జి పూర్తిగా నీటి ప్రవాహనికి కోట్టుకుపోయింది సుమారు 42 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శబరి నది పొంగి ప్రవహిస్తుంది. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పలు ప్రాంతాల్లోని ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను పరిశీలించి, భద్రత చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతి, ఎస్ఐ సంతోష్‌కుమార్‌లను సూచించారు. అన్నవరం వాగులో చిక్కుకున్న కూలీలకు అధికారులు భోజన సదుపాయం కల్పించారు.

కూనవరం: శబరి,గోదావరికి వరద పోటెత్తింది.శబరి నది కొండ్రాజుపేట కాజ్‌వేని ముంచెత్తింది. గోదావరి సంగమం వద్ద నీటి మట్టం 33.5 అడుగులకు చేరుకుంది. ముందస్తు చర్యల్లో బాగంగా చింతూరు ఐటీడీఏ పీఓ అపూర్వభరత్ శబరి బ్రిడ్జి వద్ద పెద్ద బోట్లు సిద్దంగా ఉంచారు. శబరి,గోదావరి ఉధృతిని పీఓతో పాటు గేయస్పీ పంకజ్‌కుమార్ మీనా సోమవారం సందర్శించారు. వాగుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని రెవిన్యూ, పోలీసులను ఆదేశించారు. పడవ ప్రయాణాలు నిలిపివేయాలని, చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.


అడ్డతీగల/ మోతుగూడెం: ఎడతెరిపి లేని వర్షాలుతో పింజరకొండ జలపాతం ఎర్రనీటితో ఉరకలేస్తుంది. విద్యుత్ ఉత్పత్తి కోసం నీటి మళ్లింపు నిమిత్తం వాగుపై అడ్డంగా నిర్మించిన వియర్(అడ్డుగోడ)పై నుంచి వాగు ఉధృతంగా ప్రవాహిస్తుంది. అడ్డతీగల్లోని మద్దిగెడ్డ జలాశయం నీటి మట్టం కూడా పెరగడంతో గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. మోతుగూడెం పొల్లూరు వాటర్ పాల్స్, తడిక వాగు ఉధృతంగా ప్రవాహిస్తున్నాయి. స్థానిక జెన్‌కో అధికారులు, పోలీసులు వాగుల వద్ద పహారా కాస్తున్నారు.

గంగవరం: నెల్లిపూడి వాగును రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ పరిశీలించారు. ఎవరూ వాగులు దాటొద్దని హెచ్చరించారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ చేశామన్నారు. తహసిల్దార్ శ్రీనివాసరావు, గంగవరం ఎస్ఐ వెంకటేష్ ఉన్నారు.



తాడు సాయంతో అన్నవరం వాగు దాటుతున్న కూలీలు


మూతబడిన చాపరాయి


జి.మాడుగుల సంతబయలులో నీట మునిగిన పంటలు



కొండ్రాజుపేట కాజ్‌వే పై భారీగా చేరిన వరద నీరు


బుట్టాయిగూడెం వద్ద ప్రధాన రహదారిపై కూలిన చింతచెట్టు


చీకుపనసలో భారీ వర్షానికి కూలిన ఇంటి గోడ


కాపవరం కాలనీలో కూలిన ఇంటి పైకప్పు



ఉధృతంగా ప్రవహిస్తున్న చాపరాయి జలపాతం


పొంగి ప్రవహిస్తున్న జామిగుడ గెడ్డ


ఉధృతంగా ప్రవహిస్తున్న రాంపుట్టు వాగు



ప్రమాదంగా ప్రవహిస్తున్న మాదిగమల్లు వాగు


అరకులోయలో కురుస్తున్న వర్షం


ఉధృతంగా ప్రవహిస్తున్న పింజరకొండ వాగు


కుంబిడిసింగి బ్రిడ్జిపై నుండి ప్రవహిస్తున్న వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్


కూనవరంలో శబరి ఉధృతిని పరిశీలిస్తున్న పీవో అపూర్వభరత్, ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా


సీలేరులో కురుస్తున్న వర్షం

సంతలో సీఐ తనిఖీలు

వై.రామవరం: వై.రామవరం వారపు సంతలో అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఒకపక్క సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతుందని, మరోపక్క మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారం మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు వారపుసంతలో అమ్ముతున్న నిత్యావసర వస్తువులను పరిశీలించారు. సరిహద్దు ప్రాంతం నుంచి వారపు సంతకు రాకపోకలు సాగించే వాహనాల్లో లగేజీలను సోదా చేశారు. అనుమానితులు, అపరిచితులపై గట్టి నిఘా విధించారు.

అసాంఘిక కార్యకలాపాల జోలికి పోవద్దు

అసాంఘిక కార్యకలాపాల జోలికిపోయి నేర చరితులు కావద్దని సీఐ బి.నరసింహమూర్తి అన్నారు. మండల లోతట్టు, సరిహద్దు ప్రాంతాల నుంచి వై.రామవరం వారపుసంతకు వచ్చిన ప్రజలకు సీఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అసాంఘిక శక్తులకు సహకరించవద్దన్నారు. కోడిపందేలు, జూదం వంటి వాటి జోలికిపోయి పోవద్దన్నారు. సారా తయారీ, విక్రయాలు, గంజాయ సాగు, రవాణా వల్ల కలిగే నష్టాలను వివరించారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న కారణంగా పొంగి పొర్లుతున్న కొండవాగుల్లోకి దిగి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దన్నారు. వర్షాలు తగ్గే వరకు వాగుల వద్దకు ఎవరూ వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఏసమస్య ఉన్న తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. పోలీసులు, ప్రజలు సత్సంభంధాలు కలిగి ఉండాలన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నామన్నారు. ఎస్ఐ రామకృష్ణ, ట్రైనీ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


సంతలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహ మూర్తి

వసతి గృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

చింతపల్లి: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహాన్ని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వసతి సమస్య వేధిస్తోందని, నాలుగు గదుల్లో 78 మంది ఉంటున్నారని, భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. వార్డెన్ అందుబాటులో లేరన్నారు. వసతిగృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

దారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి

సీలేరు: గూడెంకొత్త వీధి మండలానికి అత్యంత మారుమూల ప్రాంతంలో ఉన్న గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే దారకొండ మండల కేంద్రంగా ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీలేరులో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మన్యం ప్రాంతం ఏర్పడిన నుంచి ఇప్పటికీ సీలేరు దారకొండ. దుప్పులువాడ. అమ్మవారి దారకొండ. గుమ్మురేవులు. ఏ.దారకొండ తదితర పంచాయతీల్లో గ్రామాలు ఇప్పటికీ అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. ఇప్పటికీ ఈ పంచాయతీలు పూర్తిస్థాయిలో వైద్యం, విద్య, రోడ్లు, వ్యవసాయం ఆర్థికంగా వెనకబడి ఈ ప్రాంత గిరిజనులు జీవిస్తున్నారని ఆరోపించారు. సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు సుంకర విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. సాధన కమిటీ అధ్యక్షులు కారే శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కేంద్రానికి వెళ్లేందుకు సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గూడెం కొత్తవిధి మండలం ఆర్.వి.నగర్ నుంచి సీలేరు మీదుగా పాలగెడ్డ రహదారి పూర్తిగా ధ్వంసమైందని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. సర్పంచ్ దుర్జో తదితరులు పాల్గొన్నారు.

క్వారీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

రంపచోడవరం: రంపచోడవరం మండలం నరసాపురం గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న మెటల్ క్వారీని తక్షణమే మూసివేయాలని కోరుతూ పలువురు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. క్వారీలో బినామీ పేర్లతో అక్రమ వ్యాపారం సాగుతోందని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిర్వాసితులకు సత్వరమే పరిహారం

చింతూరు: పోలవరం నిర్వాసితులకు సత్వరమే పరిహారం అందించడంతో పాటు పునరావాసం కల్పించాలని గోండ్వానా గోండ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌కుమార్ నేతం డిమాండ్ చేశారు. మహాసభ ప్రతినిధులు సోమవారం డివిజన్‌లోని ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేవరకు తాము అండగా ఉంటామన్నారు. కోయ సంస్కృతి, చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మహాసభ నూతన కమిటినీ ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనరుగా పాడేరుకు చెందిన రామారావుదొర, కో–కన్వీనర్లుగా ఎస్.ముక్కయ్య, కె.శ్రీనివాస్, కె.రాజు, అంజిరావ్, లీగల్ అడ్వైజర్‌గా ఎ.నవీన్ ఎన్నికయ్యారు. సెంట్రల్ కమిటీ ఆర్గనైజర్ ఎం.నెహ్రు, టి.చంద్రయ్య, కె.అనిల్, జె.నరేష్, ఎస్.నారాయణ, బాలకృష్ణ, రాంప్రసాద్, శ్రీను, రామకృష్ణ, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకుడు తరుణ్‌కుమార్

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రోషిణి, తదితరులు

అరకులోయటౌన్: పద్మాపురం పంచాయతీలోని బొండాగుడ, భీముడువలసగ్రామాల్ల జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి పర్యటించి, వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అశోక్, సుబ్రయ్య, రాజ్‌కుమార్, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం నేడు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అధ్యక్షతన మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ ప్రజాప్రతినిధులు తదితరులు తప్పక హాజరుకావాలని కోరారు.